క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలతో విద్యార్థులు

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఇంగ్లిష్ రాత పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కిల్లాడ వెంకటరమణ, తదితరులు రూ.4 వేలతో వీటిని సమకూర్చారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.రాము మాట్లాడుతూ ఈ పుస్తకాల వల్ల విద్యార్థులకు దస్తూరీ మెరుగుపడుతుందన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు సహకారం అందించాలని కోరారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21 నుంచి ప్రత్యేక ఓటర్ల నమోదు


బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దారు రత్నం

మాడుగుల రూరల్: మండలంలో ఈ నెల 21వ తేదీ నుంచి ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టాలని తహసీల్దారు పి.వి.రత్నం తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం బీఎల్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు నమోదుతోపాటు ఓటర్ల చేర్పులు, మార్పులు, సవరణలు, తొలగింపులు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు కె. రాజా, సీనియర్ సహాయకుడు పూర్ణయ్య పాల్గొన్నారు.

వరినారు చిగుర్లు తుంచి నాట్లు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఏవో రమాదేవి

చీడికాడ: వరినారు చిగుర్లు తుంచి నాట్లు వేయాలని ఇన్‌చార్జి ఏవో ఎం. రమాదేవి తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా సోమవారం పెదగోగాడలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరినాట్లు నేపథ్యంలో శత్రు పురుగులు, మిత్ర పురుగులు గురించి వివరించారు. వరినాట్లు వేసే ముందు సూడోమోనస్ జీవ శిలీంద్ర నాశినితో నారును శుద్ధి చేయాలన్నారు. కాలిబాటలు తీయడం వల్ల ప్రయోజనాలు వివరించారు. విచక్షణ రహితంగా క్రిమిసంహారక మందులు వాడటం వల్ల నష్టాలు గురించి వివరించారు. వీఏఏ సాయిపవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర కోర్సుల్లో ప్రవేశాలను ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు చేపట్టనున్నట్టు ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఫిజిక్స్ విత్ కంప్యూటర్ సైన్సు, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కళాశాల నాక్ బీ ప్లస్ గ్రేడ్ సాధించామని, మెరుగైన శిక్షణ, ఇతర వసతి సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు కో–ఆర్డినేటర్ జి.నారాయణమూర్తిని 8247470250 సంప్రదించాలని సూచించారు.

మాడుగుల ఎంపీడీవో కాళీప్రసాద్ బదిలీ

మాడుగుల రూరల్: స్థానిక ఎంపీడీవో ఆర్. కాళీప్రసాద్‌కు బదిలీ అయింది. ఆయన శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట ఎంపీడీవోగా పనిచేస్తూ ఫిబ్రవరి ఒకటో తేదీన ఇక్కడకు ఎన్నికల బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. తిరిగి ఆదివారం సాయంత్రం ఇక్కడ నుంచి రిలీవ్ కావడంతో ఆయన స్థానంలో ప్రస్తుత ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న జి.వి.ఎస్. గోపాలరావును ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. గోపాలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.


దేవరాపల్లి: బేతపూడి కేజీబీవీలో సోదరుడికి రాఖీ కడుతున్న విద్యార్థిని


మాడుగుల రూరల్: సాగరంలో సర్పంచ్ భర్త సన్యాసినాయుడుకు రాఖీ కడుతున్న చెల్లెలు

ఆత్మీయ 'రక్ష'


కె. కోటపాడు కళాశాలలో వృక్షానికి రాఖీ కడుతున్న విద్యార్థినులు


కాశీపురం హైస్కూల్‌లో వృక్షానికి రాఖీ కడుతున్న వృక్షశాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు

అన్నాచెల్లెళ్ల అనురాగ బంధానికి అపురూప వేడుక రక్షాబంధన్.. హిందూ సంప్రదాయ పండగల్లో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న రాఖీ పౌర్ణమిని ఆనందంగా జరుపుకున్నారు. సోదరీమణులు, వారి సోదరులకు రాఖీలను కట్టి ఆత్మీయతను చాటుకున్నారు.

దేవరాపల్లి: అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కేజీబీవీలో విద్యార్థినులు తమ అన్నా, తమ్ముళ్లతో రాఖీలు కట్టించుకుని సోదర భావాన్ని చాటారు. తెనుగుపూడిలోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు అక్కాచెల్లెల్లు వచ్చి రాఖీలు కట్టి సందడి చేశారు.

కాశీపురం హైస్కూల్‌లో వృక్షా బంధన్

కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వృక్షా బంధన్ వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. దేవరాపల్లి, చీడికాడ మండలాల వృక్షశాస్త్ర ఉపాధ్యాయులు, స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహికంగా చెట్టుకు రాఖీ కట్టి మానవళి మనుగడకు వృక్షాలే ప్రాణాధారమని చాటి చెప్పారు. జీవకోటి మనుగడకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.బి.టి. సుందరి, రిసోర్స్ పర్సన్స్ బి. అప్పలనాయుడు, గణపతి, హారిక, ఉపాధ్యాయులు కొట్టాన రంబాబు, సుజాత, మాధవి, పూర్ణిమ, దొగ్గ శ్రీను, రొంగలి శివ ప్రసాద్, రామకృష్ణ, దేముళ్ల పాల్గొన్నారు.

కె. కోటపాడు: స్థానిక అయ్యన్న విద్యా సంస్థల్లో రక్షాబంధన్‌ను వినూత్న రీతిలో నిర్వహించారు. అయ్యన్న సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం ఆధ్వర్యంలో నేను నీకు రక్ష– నీవు నాకు రక్షా ఇరువురు దేశానికి రక్షా అంటూ సామూహిక ప్రతిజ్ఞతో విద్యార్థులు, విద్యార్థినులు పరస్పరం రాఖీలు కట్టుకున్నారు. కళాశాల ఆవరణలో వృక్షాలకు వీరు రాఖీలు కట్టారు. వృక్షో రక్షిత రక్షితః అని నినాదాలు పలికారు. తెలుగు ఉపన్యాసకుడు బండారు వెంకటరమణమూర్తి, అధ్యాపకులు సీమసిరి రమణ, గాడి అప్పారావు, కె.ఎస్.వి.ప్రసాదు, కల్యాణి, శివ పాల్గొన్నారు.

మాకవరపాలెం/రోలుగుంట/మాడుగుల రూరల్: రాఖీ పండగను గ్రామగ్రామాన అందరూ ఘనంగా జరుపుకున్నారు. అన్నా, తమ్ముళ్లకు అక్కా చెల్లెళ్ల రాఖీలను కట్టి సోదరభావాన్ని చాటిచెప్పుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం స్వగ్రామాలకు చేరుకుని పండగను ఘనంగా జరుపుకున్నారు. కేజీబీవీ విద్యార్థినులకు తమ అన్నా, తమ్ముళ్లు రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటుకున్నారు.

వైద్యురాలి ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

దేవరాపల్లి: కోలకతాలోని జూనియర్ వైద్యురాలిపై హత్యాచార సంఘటనను నిరసిస్తూ ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దేవరాపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. స్థానిక రామాలయం వద్ద చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో మహిళలు, విద్యార్థులు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని వైద్యురాలిపై హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం మెయిన్‌రోడ్డులో మానవహారంగా ఏర్పడి వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ప్రాణాలు పోసే వైద్యులకు రక్షణ కల్పించాలని, చట్టాలలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను, మండల సభ్యులు గంగవంశం సంతోష్, రంధి వెంకటరావు, గొర్రుపోటు రమాదేవి, జాగరపు లక్ష్మి, మిడతాడ సింహాచలం నాయుడు, అల్లు జగదీష్ పాల్గొన్నారు.


మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న కె.వి.రమణ, మహిళలు, యువకులు

గోతులమయంగా బీఎస్‌రోడ్డు


బంగారుమెట్ట జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న గొయ్యి



బుదిరెడ్లపాలెం వద్ద దమ్ములా ఆర్‌అండ్‌బీ రోడ్డు



ఎల్బీపురం గోతుల్లో అవస్థలు పడుతూ వస్తున్న ఆర్టీసీ బస్సు

- రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం– నర్సీపట్నం (బీఎస్) రోడ్డులో ఏర్పడ్డ గోతులతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుదిరెడ్లపాలెం, గొల్లకొంపలు, పొట్టిదొరపాలెం, శింగవరం, బంగారుమెట్ట, ఎల్.బి. పురం, వడ్డాది తదితర గ్రామాల వద్ద బీఎస్ రోడ్డు మధ్యన ఏర్పడ్డ గోతుల వల్ల తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్ద పెద్ద గోతుల్లో వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పగటిపూట గోతులు పడ్డ రోడ్డుపై నుంచి వెళ్లడానికి వాహనదారులు ఇక్కట్లు పడుతుండగా, రాత్రిళ్లు బెంబేలెత్తుతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. దాంతో క్షేమంగా ఇంటికి చేరే వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని భయభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. కనీసం రోడ్డుపై పడ్డ గోతులను క్రషర్ బుగ్గి వేసైనా కప్పించాలని బుచ్చెయ్యపేట, రావికమతం, చోడవరం, రోలుగుంట తదితర మండలాలకు చెందిన వేలాది మంది ప్రయాణికులు కోరుతున్నారు.

రైతులకు తప్పిన సాగునీటి కష్టాలు


ఎండలకు బీటలు వారిన లూలూరు వరి పొలాల్లో చేరిన వర్షం నీరు


బుచ్చెయ్యపేటలో వర్షం నీటితో ప్రవహిస్తున్న గుర్రపుగెడ్డ

- భారీ వర్షంతో పొలాల్లో చేరిన నీరు

బుచ్చెయ్యపేట: మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షం ఖరీఫ్ వరి పొలాలకు ఊపిరి పోసింది. వర్షాలు లేక బీటలు వారి నెర్రెట్లు వేసిన పచ్చని పొలాల్లో నిండుగా నీరు చేరింది. ఎండలికి వడలిపోయి చుట్టుకుపోతున్న వరి ఆకుమడులు తేరుకున్నాయి. మండలంలో 20 రోజులకు పైగా వర్షాలు ముఖం చాటేశాయి. వేసవిని తలపించేలా ఎండలు మండిపోయాయి. సాగు నీరు లేక అవస్థలు పడ్డ రైతాంగానికి ఒక్క రోజులోనే కురిసిన భారీ వర్షం ఊరట నిచ్చింది. బుచ్చెయ్యపేటలో 5 సెంటీమీటర్లు వరకు వర్షపాతం నమోదైంది. పొలాలన్నీ నీళ్లతో నిండిపోగా గెడ్డలు, నదులు నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. ఇప్పటి వరకు నాట్లు పడని ఎర్రవాయి గ్రామాల్లో పంట దమ్ములు చేసుకోవడానికి, వరి నాటిన పొలాల్లో గాబుతీతలు తీసి ఎరువులు జల్లడానికి వాతావరణం అనుకూలించింది. వారం పది రోజుల వరకు పొలాలకు సాగు నీరు పుష్కలంగా అందుతుందని పొట్టిదొరపాలెం, గంటికొర్లాం, బుదిరెడ్లపాలెం, లోపూడి, శింగవరం, బంగారుమెట్ట, ఎల్బీపురం, వడ్డాది, పేట తదితర గ్రామాల రైతులు తెలియజేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు రాఖీ కట్టిన వైస్ ఎంపీపీ


మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు రాఖీ కడుతున్న గొలుగొండ వైస్ ఎంపీపీ నాగమణి

నర్సీపట్నం: రక్షా బంధన్ సందర్భంగా సోమవారం తమ అభిమాన నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు రాఖీలు కట్టి తమ సోదర భావాన్ని చాటుకున్నారు. రాఖీ కట్టిన వారులో గొలుగొండ వైస్ ఎంపీపీ జక్కు నాగమణి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు


ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మంగళవారం నుంచి మండలంలో గాలికుంటు, బ్రూసెల్లా వ్యాధుల నివారణ టీకాలు పశువులకు వేయనున్నట్లు ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. సోమవారం మాడుగులలో ఆయన మాట్లాడారు. గాలికుంటు టీకాలు చీడికాడ మండలానికి 17,250, మాడుగుల మండలానికి 17,150 డోసులు వచ్చినట్లు తెలిపారు. బ్రూసెల్లా నివారణ టీకాలు చీడికాడకు 500, మాడుగుల మండలానికి 700 డోసులు వచ్చాయన్నారు. మండలానికి గోకులం షెడ్లు 25 మాత్రమే మంజూరయ్యాయన్నారు. పాడిగేదెలకు రాయితీపై బీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు.

చీడికాడ: గాలికుంటుతోపాటు, బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు ఈ నెల 20వ తేదీ నుంచి పశువులకు వేస్తామని చీడికాడ పశువైద్యాధికారి జి. గాయత్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 18వ తేదీ వరకు ఆవులు, గేదెలు, ఆడపెయ్యిలకు టీకాలు వేస్తామన్నారు. మంగళవారం తురువోలులో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహిస్తామని పెదగోగాడ పశువైద్యాధికారి రాఘవమ్మ తెలిపారు.

సంతోషిమాతకు క్షీరాభిషేకం


సంతోషిమాత చిత్రపటం వద్ద మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: జంధ్యాల పౌర్ణమి పురస్కరించుకుని కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు దొంతుకుర్తి శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం చేశారు. మాలధారణ భక్తులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి రాత్రికి పడిపూజ నిర్వహించారు.

ప్రజల మన్ననలు పొందేలా పని చేస్తే గుర్తింపు

- ఎంపీడీవోల సత్కార సభలో ఎంపీపీ లక్ష్మణమూర్తి


ఎంపీడీవోలను సత్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, అధికారులు

నాతవరం: ప్రజలు మన్ననలు పొందే విధంగా అధికారులు పని చేస్తే సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ముందు కాకినాడ జిల్లా నుంచి ఎంపీడీవోగా బదిలీపై జాగరల రాంబాబు నాతవరం మండలానికి విచ్చేశారు. ఇక్కడ పని చేసే హనుమంతరావు ఆ జిల్లాకు వెళ్లారు. పాత స్థానాలకు వెళ్లాలని ఎన్నికలు కమిషనర్ ఆదేశాలతో ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో రాంబాబు సొంత జిల్లాకు సోమవారం రిలీవ్ అయ్యారు. పాత స్థానానికి పూర్వ ఎంపీడీవో హనుమంతరావు వచ్చి చేరారు. ఇరువురికి ఎంపీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘన సత్కారం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ తక్కువ కాలంలోనే ఎంపీడీవో రాంబాబు మండలంలో అందరి మన్ననలు పొందారన్నారు. ఎంఈవో– 2 కామిరెడ్డి వరహాలబాబు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలువర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.వి. మూర్తి, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, ఉపాధి ఏపీవో చిన్నరావు, విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు శ్రీను, చినబాబు సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా చంద్రశేఖర్


ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

దేవరాపల్లి: ఇన్‌చార్జి ఎంపీడీవోగా కె. చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాయకరావుపేట ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. ఆయనకు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన సిహెచ్. సుబ్బలక్ష్మి పదవీ విరమణ చేయడంతో కె.కోటపాడు సూపరింటెండెంట్ ఎస్. అప్పలరాజు ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. కె.కోటపాడు ఎంపీడీవో స్థానం ఖాళీ కావడంతో ఆయనకు అక్కడ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులతో చంద్రశేఖర్ సమావేశమై గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, క్లోరినేషన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పలు సలహాలు, సూచనలు చేశారు.

వరి నాట్లలో మెలకువలు పాటించాలి

- వ్యవసాయ సహాయక సంచాలకుడు రవీంద్రనాథ్

చోడవరం: ఖరీఫ్ వరి నాట్లు వేసేటప్పుడు ఆధునిక మెలకువలు పాటించాలని చోడవరం వ్యవసాయ సహాయక సంచాలకుడు రవీంద్రనాథ్ సూచించారు. అంకుపాలెం పరిసర ప్రాంతాల్లో వేస్తున్న వరి నాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఆధునిక వ్యవసాయం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. సర్వే నంబరు, ఎల్పీఎం వారీగా ప్రతీ పంటను నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు తాము వేసుకునే పంటలను తప్పని సరిగా ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాలు, ఇతర నష్టాలకు రైతులకు పరిహారం వస్తుందన్నారు. ఖరీఫ్‌లో రైతులు వేసే ప్రతి పంటను ఈ క్రాప్ చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. మండల వ్యవసాయాధికారులు ఇ. పావని తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో లోపాలు సరిచేయాలని వినతి


తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీ రామునాయుడు

కె.కోటపాడు: సూదివలసలో నిర్వహించిన రీసర్వేలో లోపాలను సరి చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జె.రమేష్‌బాబును సోమవారం ఆయన కలిసి వినతిపత్రం అందించారు. రీసర్వేలో రైతుల పేర్లు, సర్వే నంబర్ల నమోదులో తప్పులు ఉన్నట్లు తెలిపారు. దాంతో రైతులకు బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలను పొందడంతోపాటు భూ క్రయ విక్రయాల సమయాల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లు వివరించారు. రీసర్వేలో లోపాలను సరిచేసి రైతులకు ఇబ్బందులు తొలగించాలన్నారు.

రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన


మీడియాతో మాట్లాడుతున్న సాధన కమిటీ, ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం: మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోవిందరావు, గీతాకృష్ణ డిమాండ్ చేశారు. సాధన కమిటీ, ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకోవడంతో పాటు అస్వస్థతకు గురైన గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. అల్లూరి, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరణించిన గెమ్మిలి భవాని, కొర్ర సధా, తాంబేలి జాషువా కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ పిల్లల విద్య విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. అల్లూరి జిల్లాకు చెందిన పిల్లలను అనకాపల్లి జిల్లాలో క్రిస్టియన్ మిషనరీ స్కూల్‌లో చదువు చెప్పిస్తామని తీసుకొచ్చి కైలాసపట్నంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారని వాపోయారు. సంఘటన జరిగి మూడు రోజులవుతున్నా, అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

చుక్కపల్లి పాఠశాలల కమిటీలకు అభినందన


చైర్మను, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చీడికాడ: చుక్కపల్లి ఎంపీపీ, ఉన్నత పాఠశాలల నూతన కార్యవర్గాలను వైఎస్సార్‌సీపీ నాయకులు దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ మాట్లాడుతూ ఎంపీపీ పాఠశాలలో ఆరు డైరెక్టర్లు, ఉన్నత పాఠశాలలో 24 డైరెక్టర్లను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఇటీవల ఎన్నికల్లో దక్కించుకుని ప్రజల మద్దతు ఎవరి వైపు ఉందో నిరూపించారన్నారు. ఎంపీపీ పాఠశాల చైర్మన్‌గా పనసల పద్మ, వైస్ చైర్మన్ శ్రీముసిరి ఈశ్వరరావు, ఉన్నత పాఠశాల చైర్మన్ మజ్జి సత్తిబాబు, వైస్ చైర్మన్ జోగలక్ష్మిలను ఎంపీపీ కురచా జయమ్మ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి లక్ష్మీ కొండబాబు, పార్టీ సీనియర్ నేతలు బాయిశెట్టి వెంకటరమణ, మజ్జి దేవానంద్, సకలా రమణ, రాము, వరహాలరావు అభినందించారు.